ఎందుకీ వివక్ష?

- రైతుబజార్ లేక దక్షిణ ప్రజల ఇక్కట్లు

పాత నగరంలో రైతు బజార్ లేక ఇక్కడి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ విషయంలో స్పందించే నాథుడే కరవయ్యాడు. ప్రభుత్వం సబ్సిడీ రేట్లకు అందించే నిత్యావసర వస్తువులు, కూరగాయలు అందక ఎక్కువ డబ్బులతో కొనాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు. తొలి నాళ్లలో టౌన్‌గా ప్రసిద్ధి చెందిన ప్రాంతమైనప్పటికీ మిగతా ప్రాంతాల్లో ఏర్పాటు చేసినట్లు దక్షిణలో మాత్రం రైతుబజార్ ఏర్పాటు చేయలేదు. దీనివల్ల ఎక్కడో దూరంగా ఉన్న రైతుబజార్లకు వెళ్లి కూరగాయలు, ఇతర సామగ్రి తెచ్చుకుంటున్నామని ప్రజలు వాపోతున్నారు.



★ నగరంలో అన్ని చోట్లా ఏర్పాటైనా.. ఇక్కడ మాత్రం లోటే
★ సబ్సిడీ ఫలాలు మాకెందుకు కల్పించరని స్థానికుల నిలదీత
★ పట్టించుకోని అధికారులు.. ప్రజా ప్రతినిధులు

డాబాగార్డెన్స్: దక్షిణ నియోజకవర్గమంటే విశాఖపట్నానికి ఆయువుపట్టు. ఇక్కడి నుంచే ప్రభుత్వ కార్యకలాపాలు జరుగుతుంటాయి. ఈ ప్రాంతం ఒకప్పుడు ఆర్థిక కేంద్రంగా నడిచింది. బ్రిటిష్ కాలంలో కూడా విశాఖపట్నానికి పేరు తెచ్చిపెట్టింది ఈ ప్రాంతమే. కానీ ఇక్కడ ఉన్న వారికి ఎటువంటి సౌకర్యాలు అందడం లేదు. చాలా మంది ఈ ప్రాంతాన్నే నమ్ముకుని ఉండిపోయారు. ముఖ్యంగా సబ్సిడీ ధరలకు ప్రభుత్వం అందించే ఫలాలు ఏవీ అందడం లేదనే ఆవేదనతో ఉన్నారు. నియోజకవర్గంలో ఉండేది బడుగు, బలహీన వర్గాల వారే. ఉదయం పోయి.. రాత్రి పొద్దుపోయాక వచ్చే దినసరి కూలీలు.. కళాసీలు.. ఫుట్‌పాత్ వ్యాపారులు.. ఆటో కార్మికులు.. ఇలా అల్పాదాయ వర్గానికి చెందినవారే ఈ ప్రాంతంలో నివాసముంటున్నారు. వీరు రోజంతా కష్టపడితే నాలుగైదు వందలు వస్తాయి. పెద్ద మొత్తం పెట్టి నిత్యావసర వస్తువులు, కూరగాయలు కొనలేక అవస్థలు పడుతున్నారు. ఇటువంటి వారి కోసం నియోజకవర్గ పరిధిలో రైతు బజారు ఏర్పాటు చేయాలని ప్రజా ప్రతినిధుల వద్ద మొత్తుకున్నా స్పందించలేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఎంతో మంది నాయకులకు సమస్య వివరించినా ఏ ఒక్క నాయకుడు రైతు బజార్ ఏర్పాటుకు కృషి చేయలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కంచరపాలెం వెళ్లాల్సి వస్తుంది..

మా ప్రాంతంలో ఎక్కడా రైతు బజార్ లేకపోవడంతో ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉన్న కంచరపాలెం రైతు బజార్‌కు వెళ్లాల్సి వస్తుంది. ఆ లాభం ప్రయాణ చార్జీలకే సరిపోతుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, ఇక్కడి ప్రజల మనోభావాలు అర్థం చేసుకుని రైతు బజార్ ఏర్పాటు చేసి ఈ సమస్య పరిష్కరించాలి. – వర్రి వరలక్ష్మి, పాతనగరం.



దూరంగా ఉన్న రైతుబజార్లే దిక్కు..

మా నియోజకవర్గంలో రైతు బజారు లేదు. త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు సమీపంలో ఉన్న రైతు బజారుకు గానీ, ఎంవీపీ రైతు బజారుకు గానీ వెళ్లి కూరగాయలు కొనాల్సి వస్తోంది. నియోజకవర్గ ప్రజల గోడు ఎవరికి కావాలి? ఎన్నికల ముందు అవి చేస్తాం ఇవి చేస్తామంటారు. ఎన్నికలయ్యాక పత్తా ఉండరు. – సీహెచ్ పవన్‌కుమార్, దిబ్బలపాలెం



సబ్సిడీలకు అర్హులం కామా..

నియోజకవర్గ పరిధిలో ప్రజలు అర్హులు కానట్టు జిల్లా యంత్రాంగం ఆలోచిస్తున్నట్లు ఉంది. ఇక్కడ ఒక్క రైతు బజారు కూడా లేకపోవడం మాకు శాపంలా ఉంది. ఇక్కడ ఉండేది అల్పాదాయ వర్గానికి చెందినవారే. ఇటువంటి వారిని దృష్టిలో పెట్టుకుని అధికారులు పనిచేయాలి. సబ్సిడీ ధరలకే నిత్యావసర వస్తువులు, కూరగాయలు అందజేయాలి. – పసగాడ రామలింగేశ్వరరావు, స్థానికుడు

మిగతా చోట్ల ఇలా..

విశాఖ మహానగరంలో పలు రైతు బజార్లు నడుస్తున్నాయి. తూర్పు నియోజకవర్గంలో త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పక్కన, ఎంవీపీ కాలనీలో రైతు బజార్లుండగా, ఉత్తర నియోజకవర్గం విషయానికొస్తే సీతమ్మధార, నరసింహనగర్, కంచరపాలెం, మర్రిపాలెం వంటి ప్రాంతాల్లో రైతు బజార్లు ఉన్నాయి. అలాగే పశ్చిమ నియోజకవర్గం, గాజువాక, పెందుర్తిలో రైతు బజార్లు నడుస్తుండగా దక్షిణలో మాత్రం ఒక్క రైతు బజారు కూడా లేకపోవడం శోచనీయం. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ ప్రాంత ప్రజల మనోభావాలు అర్థం చేసుకుని రైతు బజార్ ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఆశ్రమ వాసి భారతమ్మకు సంతాపం



భారతమ్మ కుమార్తెకు బంగారం వస్తువులు అందజేస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్, శ్రీవత్సవ్

డాబాగార్డెన్స్: స్వామి వివేకానంద ఆశ్రమ వాసి అమలాపురపు భారతమ్మ సంతాప సభ మంగళవారం సంస్థ ప్రాంగణంలో నిర్వహించారు. సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, ద్రోణంరాజు శ్రీవత్సవ్, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, పలువురు సభ్యులు సంతాప సభలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంస్థ నిర్వహించిన మహా అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి నెలా భారతమ్మకు వచ్చే పింఛన్ డబ్బులతో బంగారు చెవి దుద్దులు, ఉంగరం సంస్థ కొనుగోలు చేసింది. ఆ వస్తువులను ఆమె కుమార్తె విమలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థ అనాథశ్రమం ప్రారంభానికి భారతమ్మ మూల కారణమన్నారు. అందరితో కలివిడిగా ఉండేవారని కొనియాడారు. కార్యక్రమంలో సత్తిబాబు, భానోజీరావు, అప్పలకొండ, పైడిరాజు, సంస్థ మహిళా సభ్యులు, భారతమ్మ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేయబోమని ప్రకటించాలి



సింగ్ హోటల్ జంక్షన్ వద్ద నిరసన తెలుపుతున్న అసంఘటిత రంగ కార్మికులు

డాబాగార్డెన్స్: అసంఘటిత రంగ కార్మికులకు పనులు దొరుకుతున్నాయంటే దానికి ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులే కారణమని కార్మిక నాయకుడు కె. నరసింగరావు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం విశాఖ విచ్చేస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం సింగ్ హోటల్ జంక్షన్ వద్ద స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని ప్రకటించాలని కోరుతూ నిరసన చేపట్టారు. యూనియన్ నాయకుడు సిమ్మనాయుడు అధ్యక్షతన నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న నరసింగరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు ఈ మాత్రం పని దొరుకుతుందంటే అందుకు ప్రభుత్వ రంగ ఉద్యోగులే కారణమని చెప్పారు. కార్పొరేట్ సెక్టార్ల వల్ల అసంఘటిత రంగ కార్మికులకు ఉపాధి దొరకదని, కాబట్టి స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీను, నాయుడు, శేఖర్, పలువురు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

అల్లిపురం: ఫిషింగ్ హార్బర్‌లో ఈ నెల 4వ తేదీ రాత్రి ఇద్దరు మిత్రుల మధ్య జరిగిన కొట్లాటలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. జాలారిపేటకు చెందిన వాసుపల్లి కొండ (40), అదే ప్రాంతానికి చెందిన రాయితి ధనరాజు మిత్రులు. వీరిద్దరు ఈ నెల 4వ తేదీన ఫిషింగ్ హార్బర్ గాంధీ బొమ్మ వద్ద గొడవపడ్డారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య తోపులాట జరిగి గొడవ పెరగటంతో కొండను ధనరాజు రాయితో తలపై మోదటంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. దీంతో ధనరాజు అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికులు గాయపడిన కొండను కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొండ సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. దీంతో మృతుని బంధువులు ఫిర్యాదు మేరకు హత్య కేసుగా నమోదు చేసి నిందితుడిని మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని కోరుతూ భిక్షాటన



నిరసన తెలుపుతున్న సెవెన్ హిల్స్ ఆస్పత్రి కార్మికులు

డాబాగార్డెన్స్: తమ జీతాలు చెల్లించాలని కోరుతూ ఎంజీఎం సెవెన్ హిల్స్ ఆస్పత్రి కార్మికులు మంగళవారం భిక్షాటన చేసి నిరసన తెలిపారు. సెవెన్‌హిల్స్ నుంచి జగదాంబ కూడలి వరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు వై. రాజు మాట్లాడుతూ సంక్రాంతి పండగ అని కూడా చూడకుండా ఆస్పత్రి యాజమాన్యం కక్షపూరితంగా కార్మికుల జీతాలు నిలిపివేసిందని, కార్మిక శాఖ అధికారులు నోటీసులు పంపించినా స్పందించకుండా అమానవీయంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అతి తక్కువ జీతం తీసుకుంటూ ఇంటి అద్దె, కరెంటు బిల్లులు, పిల్లల స్కూల్ ఫీజులు, నిత్యావసర సరకుల భారాలతో జీవనం సాగిస్తున్న కార్మికులు, పండగ పూట ఊరు మీద భిక్షాటన చేసుకునే దుస్థితికి ఆస్పత్రి యాజమాన్యం తీసుకొచ్చిందన్నారు. సమస్య వెంటనే పరిష్కరించి, కార్మికుల జీతాలు చెల్లించాలని, లేనిచో ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నూకరాజు, పుష్ప, తిలోమని, వెంకటలక్ష్మి, వెంకట్రావు పాల్గొన్నారు.



హతవిధీ..

పాతనగరంలోని టౌన్ హాలు వద్ద చెత్త కుండీ పక్కనే రేషన్ పంపిణీ చేస్తున్న దృశ్యాన్ని ఈ చిత్రంలో చూడవచ్చు. కార్డుదారులు క్యూలో నిలబడి పీడీఎస్ సరకులు తీసుకుంటున్నారు. చెత్త కుండీ ద్వారా వస్తున్న దుర్గంధాన్ని భరిస్తూ తమ వంతు కోసం క్యూలైన్‌లో వారు వేచి ఉన్నారు. జగనన్న ప్రభుత్వ హయాంలో ఇళ్ల వద్దకు వచ్చి రేషన్ పంపిణీ చేసేవారు. కాని నేడు చెత్తకుండీ పక్కన పంపిణీ చేయడం గమనార్హం.

సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ప్రధాని మోదీ పర్యటనకు దక్షిణం ముస్తాబు



ప్రధాని పర్యటన సందర్భంగా ముస్తాబైన కాన్వెంట్ జంక్షన్‌లోని బాబా సాహెబ్ అంబేడ్కర్ పార్క్



డివైడర్లు కడుగుతున్న మహిళలు



పెయింటింగ్, వెల్డింగ్ పనులు చేస్తున్న కార్మికులు

డాబాగార్డెన్స్: ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 8న (బుధవారం) పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనకు రానున్న దృష్ట్యా దక్షిణ నియోజకవర్గ పరిధిలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఐఎన్‌ఎస్ డేగా నుంచి విశాఖపట్నం పోర్టు ట్రస్ట్, కాన్వెంట్ జంక్షన్, చావులమదుం జంక్షన్, రైల్వే రిజర్వేషన్ కాంప్లెక్స్, విశాఖపట్నం రైల్వే స్టేషన్, స్టేషన్ రోడ్డు మీదుగా తెలుగు తల్లి ఫ్లైఓవర్ మీదుగా ఏయూ ఇంజినీరింగ్ కళాశాల గ్రౌండ్‌లో సాయంత్రం నిర్వహించే పలు ప్రాజెక్టులకు భూమి పూజ చేయనున్నారు. ఈ నేపథ్యంలో దక్షిణ నియోజకవర్గ పరిధి పలు ప్రాంతాల మీదుగా మోదీ వెళ్లనున్న దృష్ట్యా ఇప్పటికే ఆయా ప్రాంతాలను అలంకరించారు. కాన్వెంట్ జంక్షన్‌లో గల అంబేడ్కర్ పార్క్‌ను అందంగా తీర్చిదిద్దారు.

పీఎం రాకతో పలువురికి ఉపాధి..

ప్రధాని విశాఖ విచ్చేస్తున్న సందర్భంగా గత మూడు రోజులుగా పలువురికి ఉపాధి దొరికింది. ముఖ్యంగా గత కొంత కాలంగా పనులు దొరకక ఖాళీగా ఉన్న పెయింటర్లకు ఉపాధి దొరికినట్టయింది. సంక్రాంతి పండగ ఎలా గడిచేదని ఎదురు చూస్తున్న పెయింటర్లు, రోజువారీ కూలీలకు మోదీ పుణ్యమా అంటూ పనులు దొరికాయి. పెయింటింగ్, రోడ్డు కిరువైపులా మొక్కలు, డివైడర్లకు నలుపు తెలుపు పెయింట్లు, ఎలక్ట్రికల్, వెల్డింగ్ పనులు చేసే వారికి ఊరట దొరికింది.



ముస్తాబైన విశాఖ పోర్టు ట్రస్ట్

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జడ్జి వెంకటశేషమ్మ

తాటిచెట్లపాలెం : జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూ కాలనీలో గల జీవీఎంసీ హైస్కూల్, కేఎస్‌ఎం గరల్స్ హైస్కూళ్లను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సివిల్ జడ్జి ఎం.వెంకటశేషమ్మ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కులు, చట్టాలపై విద్యార్థులకు వివరించారు. బాలలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జి.సన్యాసిరావు, కె.రాము, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

భగవద్గీతలో మానవ జీవన సారాంశం



బాలభాను పాఠశాలను సందర్శించిన విదేశీయులు

మురళీనగర్ : భగవద్గీతలో మానవ జీవన సారాంశం ఇమిడి ఉందని పలువురు విదేశీయులు పేర్కొన్నారు. స్థానిక బాలభాను పాఠశాల విద్యార్థులతో కలిసి భగవద్గీత శ్లోకాలు పఠించారు. నగరంలో నిర్వహించనున్న గురు పూజోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన విదేశీయులు మురళీనగర్ సెక్టార్–8లోని బాలభాను విద్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. స్పెయిన్, అర్జెంటీనా, అమెరికా, స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియాకు చెందిన 30 మంది ఈ నెల 11 నుంచి 13 వరకు నిర్వహించనున్న గురు పూజోత్సవంలో పాల్గొనేందుకు విశాఖ నగరానికి వచ్చారు. ఈ మేరకు వీరు బాలభాను పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. వారి భవిష్యత్ లక్ష్యాలు అడిగి తెలుసుకున్నారు. ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. భారతీయ సమాజంలోని గొప్పతనాన్ని, సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగించాలని విద్యార్థులకు సూచించారు. భారతీయుల ఆచార వ్యవహారాలంటే తమకు ఎంతో ఇష్టమన్నారు. బాలభాను విద్యాలయం కరస్పాండెంట్ బీఆర్ కే రాజు, జగద్గురు పీఠం భౌగోళిక చైర్మన్ కె.గురు ప్రసాద్, పాఠశాల డైరెక్టర్ వి.పార్వతి, పి.రవిశంకర్, ప్రిన్సిపాల్ ఎస్‌వీ శుభశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ టి.మనోరమణి, వ్యాయామ సంచాలకుడు సీహెచ్ రమణారావుతో వీరు ఆధ్యాత్మిక అంశాలు, విద్యా బోధన తదితర అంశాలపై చర్చించారు.

గోవింద మాలధారులకు ఇరుముడి



మాలధారులకు ఇరుముడి కడుతున్న అర్చకులు

కంచరపాలెం : జీవీఎంసీ 55వ వార్డు తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 10న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని గోవింద మాల ధారులు తిరుమలకు పయనమయ్యారు. అర్చకులు చామర్తి శంకరశర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేంకటేశ్వరస్వామి, పద్మావతి, అలివేలు మంగమ్మకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీ దళ బిల్వార్చన, ప్రత్యేక పూజలు, సాయంత్రం గోవింద మాలధారులకు ఇరుముడి కట్టారు. ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కేయ హత్కార్‌కు సత్కారం



కేయ హత్కార్‌ను సత్కరిస్తున్న అతిథులు

సీతంపేట : విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారం – 2025 అవార్డు గ్రహీత కేయ హత్కార్ (ముంబై) సత్కార సభ ఘనంగా నిర్వహించారు. విశ్రాంత ఏఎస్పీ ఎస్.దివాకర్ చేతుల మీదుగా కేయను సత్కరించి జ్ఞాపిక, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పది నెలల వయస్సులో సంభవించిన స్పైనల్ మస్కులర్ అట్రోఫీ (ఎస్‌ఎంఏ) కారణంగా కేయ హత్కార్ నడవలేని పరిస్థితిలో వీల్ ఛైర్‌కే పరిమితమయ్యారన్నారు. అయినప్పటికీ తన పరిస్థితికి దిగులు చెందకుండా మోటివేషనల్ స్పీకర్‌గా, రైటర్‌గా, యూట్యూబర్‌గా, ఆర్టిస్ట్‌గా రాణించి ఎందరో పిల్లలను చైతన్యవంతులను చేశారన్నారు. డిసెంబర్ 26న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కారం – 2025 అవార్డు అందుకున్నారని తెలిపారు. ప్రొఫెసర్లు పి.సుబ్రహ్మణ్యం, విఘ్నేష్, గోపాల్, పాపాహోం విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో ఆశ కార్యకర్తలు కీలకం



మాట్లాడుతున్న ఎంపీహెచ్‌ఈవో శేషుబాబు

సీతంపేట : సీజనల్ వ్యాధులు అదుపు చేయడంలో క్షేత్ర స్థాయిలో ఆశ కార్యకర్తల సేవలు కీలకమని జిల్లా మలేరియా నివారణ విభాగం ఎంపీహెచ్‌ఈవో శేషుబాబు అన్నారు. నరసింహనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో డెంగ్యూ, మలేరియా వ్యాధులను వ్యాప్తి చేసే దోమల నియంత్రణకు మంగళవారం, శుక్రవారం, శనివారం ఫ్రై డే డ్రై డే పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి నీటి నిల్వలను పరిశీలించాలని సూచించారు. దోమల వృద్ధిని నియంత్రించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్య కేంద్రం వైద్యులు మనోజ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సేవలు అర్హులందరికీ చేరేలా ఆశ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. సూపర్‌వైజర్ నాగ సతీష్, హెల్త్ సెక్రటరీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.